ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 18 జూన్ 2024 | 5





- పోలవరాన చంద్రబాబు పర్యటన
- గంటన్నర సేపు అణువణువూ పరిశీలన
- ఎండలోనే కలియతిరిగిన వైనం
- నిర్మాణంపై అధికారుల నుంచి ఆరా
- ప్రాజెక్టు ప్రాంతం చూసి ఆవేదన
- జగన్ పాలనలో ధ్వంసం
- మళ్లీ మొదటికొచ్చిందని బాధ
- ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి

# పోలవరం చూసి.. కలవరం



దయాఫ్రంవాల్‌ను పరిశీలిస్తున్న బాబు

వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కళ తప్పిన పోలవరం ప్రాజెక్టు పనులు చూసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నివ్వెరపోయారు. 2019కు ముందు సీఎంగా చంద్రబాబు వచ్చినప్పుడు నిత్యం పనులు జరుగుతుండేవి.. ప్రాజెక్టు ప్రాంతం యంత్రాలు.. భారీ వాహనాలతో కళకళలాడేది.. ఎటు చూసినా వేలాది మంది కార్మికులు పనిచేసేవారు. ప్రాజెక్టు చూడడానికి వేలాదిగా ప్రజలు వచ్చేవారు.. నాడు పోలవరం ప్రాజెక్టు ఒక పర్యాటక ప్రాంతంగా మారిందనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. ప్రతి ఒక్కరి నోటా పోలవరం ఎంత వరకూ వచ్చిందో అనే మాట వినిపించేది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇది ధ్వంసమైంది. యంత్రాలు లేవు. ఏదో కొద్ది లారీలతో ఇసుక తరలింపు తప్ప ఇంకేమీ పనులు సాగకపోవడంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆశ్చర్యపోయారు.. నా మానసపుత్రిక పోలవరం ఇలా ఉందేమిటో అని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలస్థితిలో ఉన్న ప్రాజెక్టును చూసి నివ్వెరపోయారు.

## అణువణువూ పరిశీలన...

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు తొలి పర్యటనగా పోలవరం సందర్శించారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు హయాంలో సోమవారం.. పోలవారం.. అంటూ ప్రతివారం పర్యటిస్తూ పనులు పరుగులు పెట్టించారు. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలవడంతో వైసీపీ చేతిక పగ్గాలు వచ్చాయి. అయితే జగన్ మాత్రం పోలవరం ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో 72 శాతం పనులు పూర్తవ్వగా నేడు అదే స్థితిలో ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం కావడంతో సోమవారం.. పోలవారంగా మార్చారు. అమరావతి నుంచి హెలికాఫ్టర్‌లో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కార్వాన్ బస్‌లో స్పిల్‌వే మీదకు వచ్చారు. స్పిల్‌వే బ్లాక్ 26వ వద్ద పనుల ప్రగతిపై అధికారులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు అక్కడి పరిస్థితిని వివరించారు. చంద్రబాబు అధికారులను కొన్ని ప్రశ్నలు వేయడంతో పాటు కొన్ని సూచనలు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఫొటోలను పరిశీలించి ఆరా తీశారు. ఒంటి గంటకు గైడ్‌బండ్ గ్యాప్-3, యుఎస్‌సీడీ, గ్యాప్-1,2, డీఎస్‌ఈడీ వద్ద బస్ దిగి పరిశీలించి, ఇరిగేషన్ ఇంజనీర్లను పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఎగువ కాఫర్ డ్యామ్‌కు చేరుకుని సీపేజీల గురించి ప్రశ్నించారు. పవర్‌హౌస్ దిగువ భాగం నుంచి డయాఫ్రంవాల్ నిర్మించిన ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అధిక వర్షాలకు నాలుగుచోట్ల దెబ్బతిన్నట్టు అధికారులు వివరించారు. అక్కడ దిగువ కాఫర్ సమీపంలోకి వచ్చి వాటిని పరిశీలించి పవర్ హౌస్ పనులు చూసి సుమారు 2 గంటల ప్రాంతానికి తిరిగి పోలవరం స్పిల్‌వే ఎగువ భాగంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయన వెంట ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రులు కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, బడేటి చంటి, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్పీ డి.మేరీప్రశాంతి, జేసీ బి.లావణ్య, ఆర్డీవో అద్దయ్య ఉన్నారు.



పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు. చిత్రంలో ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి జవహర్ తదితరులు

## పోలవరాన్ని జగన్ ధ్వంసం చేశాడు : చంద్రబాబు

పోలవరం జీవనాడి.. దీనిని జగన్ ధ్వంసం చేశాడన్నారు. తాను 72 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టును ఎన్ని విధాలా సంక్లిష్టం చేయవచ్చో అన్ని విధాలా చేసి పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ మాదిరిగా ఏజన్సీని మార్చేయడం, కమిటీలు వేసి తప్పులు వెతకడం కంటే ముందు ప్రాజెక్టును ఎలా పూర్తి చేయాలనేది ముఖ్యమన్నారు. జగన్‌కు అవగాహనలేక, మూర్ఖంగా ఉండడం వల్ల గతంలో ఏజెన్సీని మార్చడంతో పాటు రివర్స్ టెండర్ అంటూ ప్రాజెక్టును పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది చైనాలోని త్రీగోర్జెస్ కన్నా అధిక స్థాయిలో నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇక్కడ 194 టీఎంసీల నీరు నిల్వ చేయవచ్చని, 320 టీఎంసీల వరకూ వరద నీటిని వినియోగించుకోవచ్చన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయాఫ్రంవాల్‌ను నిర్మించామని కానీ 2019, 20లో భారీ వర్షాల కారణంగా నాలుగుచోట్ల దెబ్బతిందన్నారు. దీని మరమ్మతులకు రూ.447 కోట్లు ఖర్చవుతుందని.. పూర్తిగా మరమ్మతులు అవుతా యనే భరోసా లేదన్నారు. ప్రత్యామ్నాయంగా డయాఫ్రంవాల్ నిర్మించడానికి రూ.996 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేసినట్టు చెప్పారు. దీనికి కనీసం నాలుగు సీజన్లు పడుతుందని, 2022కే పూర్తి కావలసిన ప్రాజెక్టు మరింత ఆలస్యమవుతుందన్నారు. రాజకీయాలకు పనికి రాని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. ఇవన్నీ చూసి అర్థం చేసుకున్నానని, ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

## 'పోలవరం' ఇక వేగవంతం: దుర్గేష్

నిడదవోలు, జూన్ 17: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారాన్ని పోలవారంగా మార్చుకున్నారని గతంలో కూడా సోమవారం పోలవారంగా మార్చుకుని ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేశారని.. అయితే గత ముఖ్యమంత్రి శుక్రవారాన్ని తన వారంగా మార్చుకున్నారని అది ఎందుకో అందరికీ తెలిసిందే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంయుక్తంగా పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తారన్నారు.



బాబుకు దుర్గేష్, బత్తుల స్వాగతం



పాపికొండలు ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న చంద్రబాబు కాన్వాయ్



కల్యాణ వేదికపై ఉభయ దేవేరులతో బాలబాలాజీస్వామి

# కల్యాణ వైభోగమే

### అంగరంగ వైభవంగా బాలబాలాజీ కల్యాణం

### గోవింద నామస్మరణతో మార్మోగిన అప్పనపల్లి

వైనతేయ నదీ తీరం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన సోమవారం రాత్రి 8.59 గంటలకు అప్పనపల్లి బాలబాలాజీస్వామి దివ్య కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం వేదమంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. చినజీయర్‌స్వామి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్, అర్చకులు ఎదుర్కోలు సన్నాహంలో స్వామివారి గుణగణాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. 315 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కల్యాణ క్రతవును తిలకించి పునీతులయ్యారు.... 7లో



ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

# అన్ని మండలాల్లో 23న ఒలింపిక్ డే రన్

అమలాపురం టౌన్, జూన్ 17:
అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సోమవారం కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు అధ్యక్షతన ఒలింపిక్ డే రన్-2024 సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 23న ఒలింపిక్ రన్ నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఆయా మండలాల ఆర్గనైజర్లకు కరపత్రాలు, ఫ్లెక్సీలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో 23వ తేదీ ఉదయం 8 గంటలకు ఒలింపిక్ రన్‌ను దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ క్లబ్ వద్ద ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఒలింపిక్ డే రన్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి గోకరకొండ నాగేంద్ర, కన్వీనర్ రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, కల్వకొలను బాబు, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, చిట్టూరి చంద్రశేఖర్, విత్తనాల శ్రీను, ఎం.రమేష్, ఉండ్రు ముసలయ్య, ఐ.భీమేష్, జి.శ్రీదేవి, కె.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

# చెల్లింపులేవీ!

> ఖరీఫ్ సీజను మొదలైనా రబీలో అమ్మిన ధాన్యం సొమ్ములు ఇంకా రైతులకు రాలేదు. సాగుకు పెట్టుబడి సొమ్ము కోసం వారు ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ నెల 29 తర్వాత రైతులు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించిన ధాన్యానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా వారి ఖాతాల్లో జమ కాలేదు. ధాన్యం అమ్మి ఇప్పటికి సుమారు 50 రోజులు అవుతున్నా చెల్లింపులు జరగలేదు.



- 'రబీ' బకాయిలు రూ.270.20 కోట్లు
- రైతుల ఖాతాల్లో ఇంకా జమ కాని ధాన్యం సొమ్ము
- ధాన్యం అమ్మి 50 రోజులైనా చెల్లించని వైనం
- ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కోసం అన్నదాతల ఎదురుచూపు

ముమ్మిడివరం, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 22,370 మంది రైతులకు రూ.270.20 కోట్లను పౌరసరఫరాల శాఖ చెల్లించాల్సి వుంది. రబీలో జిల్లాలో రైతుల నుంచి 2,26,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా 19,880 మంది నుంచి 1,62,645.760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి రూ.355.84 కోట్లు రైతులకు చెల్లించాల్సి వుండగా ఇప్పటివరకు 5,921 మందికి రూ.84.47 కోట్లు చెల్లించగా... 22,370 మందికి రూ.270.20 కోట్లు చెల్లించాలి. గత రబీలో రైతులు ఎంటీయూ-1121, ఎంటీయూ-3626 (బొండాలు) రకాలు సాగు చేశారు. ఈ ఏడాది ఎంటీయూ-3626 ధాన్యానికి డిమాండు ఉండడంతో మిల్లర్లు నేరుగా ఈ రకం ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన 10 నుంచి 15 రోజులకే పేమెంట్ ఇచ్చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించిన ఎంటీయూ-1121 రకానికి మాత్రం 50 రోజులు అవుతున్నా బిల్లుల చెల్లింపు జరగలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌలు రైతులు సాగుకు సంబంధించి ఎరువుల డీలర్లు, బ్యాంకులు, ఇతర ఫైనాన్సర్ల వద్ద నుంచి అప్పులు తెచ్చి రబీకి పెట్టుబడి పెట్టారు. పండిన ధాన్యం విక్రయించగా వచ్చిన సొమ్ములతో ఆ అప్పులు తీర్చి మళ్లీ ఖరీఫ్‌కు ఉపక్రమిస్తారు. అయితే రబీలో విక్రయించిన ధాన్యం సొమ్ములు అందక రైతులు దిక్కులు చూస్తున్నారు. జిల్లాలో 1,68,780 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. వీరిలో కౌలు రైతులు ఎక్కువగా ఉండడంతో సాగుకు పెట్టుబడులకు ఇబ్బందిపడుతున్నారు. ఇవే కాక సంచులకు సంబంధించి రూ.18.01 లక్షలు, హమాలీ చార్జీలు రూ.212.65 లక్షలు, రవాణా చార్జీలు రూ.263.98 లక్షలు చెల్లించాల్సి ఉంది. ధాన్యం సొమ్ములను తమ ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### నెల రోజులైంది

**పాటి రవి, కౌలు రైతు, క్రాప**



రబీ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించి నెల రోజులైంది. ఇంత వరకు సొమ్ము రాలేదు. ఖరీఫ్ సీజను మొదలవ్వడంతో పెట్టుబడులకు సొమ్ములు లేక ఇబ్బందిపడుతున్నాం.

### బ్యాంకుకు అప్పులు కట్టాలి

**పైగోడి వీర వెంకట సత్యనారాయణ, రైతు, క్రాప**



రబీలో ఎంటీయూ-1121 వరి రకం సాగు చేశాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాం. ఇప్పటికి 40 రోజులైంది. సొమ్ములు మాత్రం బ్యాంకు ఖాతాలకు జమ కాలేదు. బ్యాంకులో తీసుకున్న పంట రుణాలకు వాయిదా మీరింది. సొమ్ము లేక ఇబ్బంది పడుతున్నాం. త్వరగా ధాన్యం సొమ్ములు చెల్లిస్తే బ్యాంకు అప్పులు జమ చేసి ఖరీఫ్ సాగుకు ఉపక్రమిస్తాం.

### ప్రైవేటు మిల్లర్లే త్వరగా చెల్లించారు

**మోటూరి మోహనరావు, రైతు, క్రాప**



ఆరు ఎకరాలు సాగు చేశాను, ఎంటీయూ-1121 వరి రకం వేశాను. ఈ ధాన్యాన్ని విక్రయించి 35 రోజులైంది. మాతోపాటు మాసూలు చేసిన రైతులు బయటి మిల్లర్లకు అమ్మితే వారికి సొమ్ములు వచ్చేశాయి. నేను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఇప్పటిదాకా సొమ్ములు చేతికి రాలేదు.

### ఆర్థికంగా కష్టంగా ఉంది

**గుత్తుల వీర వెంకట సత్యనారాయణ, కౌలు రైతు, క్రాప**



ఏప్రిల్ నెలలో ధాన్యం విక్రయించాను. ఇంతవరకు సొమ్ములు బ్యాంకు ఖాతాకి జమ కాలేదు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయిస్తే 21 రోజుల్లోపే బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేస్తామని ప్రకటనలు ఇస్తున్నారు. నెలలు గడిచినా సొమ్ములు మాత్రం పడలేదు. దీంతో ఆర్థికంగా కష్టంగా ఉంది.



ఎన్.రామేశ్వరం తీరంలో తువ్వ ఇసుక తరలించడంతో ఏర్పడిన భారీ గొయ్యి

# తువ్వేస్తున్నారు

- అల్లవరం మండలంలో యథేచ్ఛగా తువ్వ ఇసుక తవ్వకాలు
- పట్టించుకోని మైన్స్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు
- తీర గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు

అల్లవరం జూన్ 17: అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తువ్వ ఇసుక తవ్వేస్తున్నారు. తీరానికి రక్షణగా ఉన్న ఇసుక గుట్టలను రాత్రి, పగలు అక్రమంగా కొల్లగొట్టడంతో అల్లవరం మండలం ఎన్.రామేశ్వరం, కొమరగిరిపట్నం, ఓడలరేవు సముద్ర తీర గ్రామాలకు పెను ప్రమాదం పొంచి ఉంది. ఇసుక గుట్టలు తీసేసిన స్థలాలను ఆక్వా చెరువులుగా మార్చేందుకు తువ్వ ఇసుకను అమ్మేడయంతో ట్రాక్టర్ల ద్వారా తీర గ్రామాల్లో ఇసుక తరలింపు జోరుగా సాగుతోంది. మామూళ్ల మత్తులో ప్రభుత్వ అధికారులు పట్టించుకోక తీర గ్రామాలు గుల్లవుతున్నాయి. తుఫాన్లు, సునామీల వంటి విపత్కర పరిస్థితులకు రక్షణగా ఉండే తీర గ్రామాల్లో కొండల మధ్య ఇసుక గుట్టలు నేడు ఇసుక తీసేసిన ప్రమాద భరిత గోతులుగా మారాయి. పోటు సమయంలో సముద్రపు నీరు తిన్నెలపైనుంచి ఎగసి పడుతోంది. ఎన్.రామేశ్వరం మత్స్యకార దీవిలో అడ్డుఅదుపూ లేకుండా ఎక్స్‌కవేటర్ల సాయంతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇసుకను భారీగా తవ్వేయడంతో ఎన్.రామేశ్వరం దీవి ఉనికికే ప్రమాదంగా మారిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓడలరేవులో ఓఎన్జీసీ ప్లాంటు స్థలం మెరక చేయాలన్నా, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాల పునాదులు, ఇళ్ల పునాదులు నింపాలన్నా తీర గ్రామాల తువ్వ ఇసుకే తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం అనుమతులు ఇవ్వడంతో తీర గ్రామాలు గుల్లయి ప్రమాదం అంచున ఉన్నాయి. తీరం వెంబడి అటవీ శాఖ భూములు, రైతుల భూముల్లో తువ్వ ఇసుకను తరలించి సీఆర్‌జడ్ పరిధిలో ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. విద్యుత్, రెవెన్యూ శాఖలు అక్రమ ఆక్వా సాగును ప్రోత్సహిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. సముద్ర తీరంలో కిలోమీటరు వెడల్పున భూమి సముద్రంలో కలిసిపోగా అక్రమ ఆక్వాసాగుకు అడ్డూ అదుపు లేదు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎన్.రామేశ్వరం గ్రామాలను రక్షించాలని, తీర గ్రామాల్లో తువ్వ ఇసుక తోలకాలను ఆపాలని తీర ప్రాంత ప్రజలు టీడీపీ కూటమి నూతన ప్రభుత్వానికి సంబంధించిన మంత్రులకు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కల్యాణం.. కమనీయం

వైనతేయ నదీ తీరం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. అప్పనపల్లి బాలబాలాజీస్వామి దివ్య కళ్యాణాన్ని పాంచాహ్నిక దీక్షతో పాంచరాత్ర ఆగమానుసారం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన సోమవారం రాత్రి 8.59 గంటలకు వేద మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు.



కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు

మామిడికుదురు, జూన్ 17:చినజీయర్‌స్వామి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్, అర్చకులు ఎదుర్కోలు సన్నాహంలో భాగంగా స్వామివారి గుణగణాలను వివరించిన తీరు భక్తుల మనసులను రంజింపచేసింది. కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించగా 315 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. వారికి దేవస్థానం సిబ్బంది తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు వీలుగా ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనరు గ్రంధి మాధవి పర్యవేక్షణలో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

## టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



సీతారామ్

అంబాజీపేట, జూన్ 17: టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు తణుకుకు చెందిన వారణాసి సీతారామ్ (53), అతని భార్య మహాలక్ష్మి, కుమార్తె లాస్యశ్రీ మోటారు సైకిల్‌పై ఈ నెల 16న అమలాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముక్కామల సమీపంలోకి వచ్చేసరికి రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీతారామ్ చికిత్స పొందుతూ మృతి చెందగా మహాలక్ష్మి చికిత్స పొందుతోంది. లాస్యశ్రీ కుడికాలును తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు.

## బాలికపై అత్యాచారం

మలికిపురం, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలోని ఒక గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికను 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారం చేశాడు. తొమ్మిది సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 55 సంవత్సరాల వై.సంపదరావు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల 12వ తేదీన ఈ సంఘటన జరగ్గా బాలిక తండ్రి ఈ నెల 16న ఆదివారం రాత్రి మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజోలు సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు. సంఘటనా స్థలాన్ని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ సోమవారం సాయంత్రం పరిశీలించారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

పిఠాపురం రూరల్, జూన్ 17: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ సోమవారం వెల్లడించారు. భోగాపురం గ్రామంలోని ఆలయం వద్ద నిద్రిస్తున్న బొమ్మదేవు ప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన నాగులాపల్లి పద్మరాజు నాపరాయితో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు కోసం కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. ప్రసాద్, పద్మరాజులు ఇద్దరు కాకినాడ గాంధీనగర్‌లోని ఒక మేస్త్రి వద్ద 15 రోజులుగా పనిచేస్తున్నారు. 13వ తేదీన చేసిన పనికి సంబంధించి ప్రసాద్ మేస్త్రిని డబ్బులు అడగగా, పద్మరాజు తీసుకు వెళ్లినట్లు చెప్పాడు. దీనిపై అదే రోజు రాత్రి ఇద్దరి మధ్య వివాదం జరిగింది. తనను చంపుతానని బెదిరించడంతో పద్మరాజు అదే రోజు రాత్రి నిద్రిస్తున్న ప్రసాద్‌ను రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. పద్మరాజును బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం



ఆత్రేయపురం, జూన్ 17: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఒక కుటుంబం కారులో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వచ్చింది. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా లొల్ల-నల్లకాల్వ సమీపంలో కారు ప్రమాదవశాత్తు అదుపు తప్పి పంటకాల్వలోకి దూసుకెళ్లింది. స్థానికులు కారును బయటకు తీశారు. అందులో ఉన్నవారంతా సురక్షితంగా బయటపడ్డారు.



## మరో పది డయేరియా కేసులు

బాధితులను పరామర్శించిన వైద్య శాఖ ఉన్నతాధికారులు

కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు



పరామర్శిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో నర్సింహనాయక్

తొండంగి,జూన్ 17:తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో సోమవారం మరో 10 డయేరియా కేసులు నమోదయ్యాయి.ఆదివారం కొంత నెమ్మదించినప్పటికి తిరిగి పది కేసులు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నర్సింహనాయక్ గ్రామాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.గత కొద్ది రోజులుగా ఆయన ప్రతి రోజు గ్రామాన్ని సందర్శించి తగిన సూచనలు జారీ చేస్తున్నారు.ఇప్పటి వరకూ సుమారు వంద కేసుల వరకూ నమోదు కావడంతో శాసన.మండలి ప్రతి పక్షనేత యనమల రామకృష్ణుడు,స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్యలు ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసారు.దీంతో జిల్లా అధికారులంతా ప్రతి రోజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారి భారతీ సౌజన్య ,డీఎల్‌పిఓ బాలామణిలు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తగిన సూచనలు జారీ చేసారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన పారిశుధ్య సిబ్బంది గ్రామమంతా శుభ్రపరచి బ్లీచింగ్ చల్లి క్రిమి సంహారక మందులు పిచికారీ చేసారు.తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.గ్రామస్తుల సూచన మేరకు వాటర్ పైప్‌లైన్ కు సంబంధించిన గేట్ వాల్వు ఉన్న ప్రాంతంలో సిమ్మెంట్ రహదారి నిర్మించడంతో దానిని పరిశీలించేందుక అక్కడ తవ్వించారు.స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న రోగుల్ని జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్ జిల్లా ఉపవైద్యాధికారి సరితలు పరామర్శించారు.తగు జాగ్రత్తలు తీసుకోవాలని ,కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతిలు వైద్యసేవలు అందిస్తున్నారు.మండల టిడిపి నేత యనమల రాజేష్ మాట్లాడుతూ రోగులంతా ధైర్యంగా ఉండాలన్నారు,యనమల రామకృష్ణుడు జిల్లా అధికారులను రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారని.ప్రభుత్వం అన్ని విధాలా రోగులకు అండగా ఉంటుందన్నారు.ఎవరూ ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు.ఎంపిడిఓ మల్లేశ్వరావు, తదితరులు పారిశుధ్యపనులు పర్యవేక్షించారు.

## పలు రకాలుగా మోసాలు

- రూ.కోటికి పైగా కాజేసిన వ్యక్తి?
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఆలమూరు, జూన్ 17: దివ్యాంగుడు..అనగానే ఎదుటివారు జాలి, దయ చూపిస్తారు. కానీ దానినే పెట్టుబడిగా ఈ దివ్యాంగుడు పలువురిని అనేక రకాలుగా బుట్టలో వేసుకుని వారి వద్ద నుంచి రూ.కోటికి పైగా లాగేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో జరిగిన ఈ ఘటనలో అనేక విషయాలు బయటపడుతున్నాయి. సదరు దివ్యాంగుడిపై బాధితులు ఆలమూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన యర్రంశెట్టి దుర్గారావు అనే దివ్యాంగుడు పెళ్లిళ్ల మధ్యవర్తిగా వ్యవహరిస్తూ అనేక మందిని మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అతడు తల్లి వెంకయమ్మ, తమ్ముడు మురళి సహాయ సహకారాలతో ఈ నేరాలకు పాల్పడినట్టు బాధితులు చెప్తున్నారు. మూలస్థానం గ్రామానికి చెందిన డి.రాంబాబు కుమారుడికి చాగల్నాడు నుంచి నాలుగు ఎకరాలు కట్నం ఇస్తారని పెళ్లి సంబంధం తీసుకొచ్చాడు. పెళ్లి కుదిర్చేందుకు పావులు కదిపాడు. పెళ్లి కుమార్తె తరపు వారు ఇబ్బందుల్లో ఉన్నారని నమ్మించి పలు దఫాలుగా బంగారంతో పాటు దాదాపు రూ.40 లక్షల వరకు నగదు కాజేసినట్టు బాధితులు వివరించారు. నవాబుపేటలో పాల వ్యాపారం చేసుకునే సురేష్ వద్దకు వచ్చి స్నేహం చేశాడు. కొద్దిరోజల తర్వాత తన బంగారాన్ని బ్యాంకులో కుదువపెట్టానని, అది వేలానికి వచ్చిందని దుర్గారావు చెప్పాడు. తాను విడిపించుకోలేనని రూ.4.10 లక్షలు చెల్లిస్తే దాదాపు రూ.10 లక్షల విలువ గల బంగారం తీసేసుకోవచ్చని నమ్మబలికి ఆ మొత్తాన్ని తీసుకున్నట్టు బాధితుడు సురేష్ చెప్పాడు. రావులపాలెంలో ఒక ఫైనాన్స్ కంపెనీ యాజమాని వద్ద ఇదే చెప్పి దాదాపు రూ.10 లక్షలు కాజేసిన వ్యవహారం కూడా వెలుగు చూసింది. దుర్గారావు ఆలమూరు, కడియం, రావులపాలెంల్లో అనేక మోసాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. అతడిపై ఆలమూరు పోలీస్ స్టేషన్లో ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు అందాయి.

## సిలిండర్ పేలి తాటాకు పాక దగ్ధం

రూ. 7 లక్షల ఆస్తి నష్టం



గొల్లప్రోలు రూరల్, జూన్ 17: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి తాటాకుపాక దగ్ధమవడంతో రూ. 7 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన పోలవరపు చంద్రరావు కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటారు. సోమవారం పనులు నిమిత్తం బయటకు వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లతో పాటు 7 కాసుల బంగారం నగలు, చీటి పాడి ఇంటిలో తెచ్చి పెట్టిన నగదు, బీరువాలు, బట్టలు, ఇతర నిత్యావసర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంతో రోడ్డున పడ్డామని చంద్రరావు, అతని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. మంటలు పక్కనే ఉన్న షేక్ రాజుబాబు ఇంటికి వ్యాపించడంతో అతని ఇంటికి ఉన్న ఏసీ, గదిలో ఉన్న మంచం, ఇతర సామాన్లు కాలిపోయాయి. ప్రమాదంలో ఆస్తినష్టం రూ.7 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికే స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు మరింతగా వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## పదివేల కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం

గొల్లప్రోలు, జూన్ 16: జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలతో పాటు పర్యావరణ శాఖా మంత్రిగా ఈ నెల 19వ తేదీన బాధ్యతలు స్వీకరిస్తున్న వేళ ఒక జనసేన నేత వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజున ప్రారంభించి పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాజెక్టు రైజ్ కోకో పేరుతో పదివేల కొబ్బరిమొక్కలు నాటే కార్యక్రమానికి జనసేన నేత మురాలశెట్టి సునీల్‌కుమార్ శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చల్లా లక్ష్మి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, మారిశెట్టి బుజ్జి, బాపన్నదొర, సానా నాగు, కండేపల్లి నూకరాజు, గంధం నాగేంద్ర, రావు రాజేష్ పాల్గొన్నారు.



వ్రతమాచరిస్తున్న భక్తులు

## సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

అన్నవరం, జూన్ 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి సోమవారం భక్తులతో పోటెత్తింది. ఏకాదశి పర్వదినం, బక్రీదు సెలవు దినం కావడంతో ఈ రద్దీ నెలకొంది. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు సుమారు 4500 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.55 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఆలయ అధికారులు వివిధ ఏర్పాట్లు చేశారు.

## విజయనగరం ఎంపీ పూజలు



పూజలు చేస్తున్న అప్పలనాయుడు

అన్నవరం, జూన్ 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి సోమవారం విజయనగరం ఎంపీగా ఎన్నికైన కలిశెట్టి అప్పలనాయుడు మొక్కులు చెల్లించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తానని అప్పలనాయుడు అనుకున్నారు. అయితే వీటిని సోమవారం తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రులకు ఉపయోగపడే పోలవరం, అమరావతి రాజధాని చంద్రబాబు హయాంలో త్వరితగతిన పూర్తికావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో ఎం.గణపతి తదితరులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.

## 12 కిలోల వాలుగ చేప



కొత్తపేట, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ గ్రామంలో ఓ రైతుకు పంట చేలో పెద్ద వాలుగ చేప దొరికింది. కండ్రిగకు చెందిన రైతు బొక్కా రామమూర్తి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి చేలో నీరు పెట్టడానికి పొలానికి వెళ్లాడు. తన చేలో పెద్ద చేప అటూఇటూ తిరుగుతుండడం చూసి ఆశ్చర్యానికి గురయ్యాడు. దానిని పట్టుకుని పైకి తీశాడు. సుమారు మూడు అడుగుల పొడవు 12 కిలోల బరువున్న ఈ చేప పంట చేలో దొరకడంపై సమీప రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే పంట కాల్వలో మూడు లేదా నాలుగు కిలోలకు మించి వాలుగలు దొరకవు. ఇంత పెద్ద చేప దొరకడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

## అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 17: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ర్యాలికి చెందిన కోదాటి రవికిశోర్-వెంకటరత్నకుమారి దంపతులు రూ.1,00,008 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.4,51,958 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

## భీమేశ్వరునికి పూజలు



సామర్లకోట, జూన్ 17: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో 18 రోజుల పాటు భారతీయ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శివలింగ జీర్ణోద్ధారణ ప్రక్రియ పూర్తవడంతో ఏకాదశి సోమవారం తెల్లవారుజాము నుంచి దర్శనాలకు అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ తదితరులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు చక్కెరపొంగలి, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాలను మూడు వేల మందికి మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయం వెలుపల గల భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

## జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



కరప, జూన్ 17: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన సునంద తేజశ్రీ ఎంపికయ్యింది. కాకినాడలోని అన్నవరం సత్యదేవ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తేజశ్రీ గత మే 31 నుంచి జూన్ 1వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ చింతా నారాయణమూర్తిరాజు తెలిపారు. దీంతో సెలక్టర్లు ఆమెను రాష్ట్రజట్టుకు ఎంపికచేశారని, ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరిగే ఆల్ ఇండియా బాలికల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆడేందుకు సోమవారం బయలుదేరి వెళ్లినట్టు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తేజశ్రీని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, గురజనాపల్లి హైస్కూల్ పీడీ కర్రి నాగలింగేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

## సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, జూన్ 17: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన పి. రోజాశ్రీదేవి రూ 1,00,116 విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం ప్రసాదాలు అందజేశారు.

### ఎమ్మెల్యే రఘురామను కలిసిన టీడీపీ నేతలు

అల్లవరం, జూన్ 17: టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు ఆధ్వర్యంలో 40వాహనాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు భీమవరం ర్యాలీగా వెళ్లారు. ఉండి ఎమ్మెల్యే విజేత కలిదిండి రఘురామకృష్ణరాజుకు సత్తిబాబురాజు దుశ్శాలువా కప్పి సన్మానించారు. పోతుల నాగరాజు, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, పచ్చిమాల ఏడుకొండలు, కాకిలేటి సూర్యప్రకాశం, ఈసకోను సాంబశివరావు, మామిడిశెట్టి శ్రీరామ్, రాసూరి రఘురాంబాబు పాల్గొన్నారు.

- జిల్లాలో ఘనంగా బక్రీద్ పండుగ
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- సర్వాంగ సుందరంగా అలంకరించిన మసీదులు

# కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం



సీఐటీయూ జిల్లాశాఖ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ

అమలాపురం టౌన్, జూన్ 17: కార్మిక హక్కులను పరిరక్షించుకునేందుకు ఉద్యమ పోరాటాలే శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, సుబ్బారావమ్మ పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పేదలకు భారాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాసే విధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలరన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కార్మిక, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలే శరణ్యమన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో గుదే దుర్గాప్రసాద్ అధ్యక్షతన సోమవారం సీఐటీయూ జిల్లా మొదటి మహాసభ జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన నాగేశ్వరరావు, సుబ్బారావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. రెండేళ్ల కార్యకలాపాల నివేదికను కె.కృష్ణవేణి మహాసభలో ప్రవేశపెట్టారు. జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా గుదే దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నూకల బలరామ్, కోశాధికారిగా కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా ఎం.భాస్కరరావు, బండి లక్ష్మి, కార్యదర్శులుగా సత్యనారాయణ, ఎం.సుభాషిణిలతో పాటు 42మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుందరబాబు, కాకినాడ జిల్లా కోశాధికారి మలక రమణ, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం అమలాపురం మున్సిపల్ కార్యాలయం వెనుక సీఐటీయూ నూతన అద్దె కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రారంభించారు. వివిధ యూనియన్ల నాయకులు విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహనరావు, కుసుమ ఆదిలక్ష్మి, పి.అమూల్య పాల్గొన్నారు.

# ఘనంగా గజమాల యాత్ర



మామిడికుదురు, జూన్ 17: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి-ఆదిలక్ష్మి దంపతులకు సమర్పించే గజమాల యాత్ర సోమవారం ఘనంగా జరిగింది. శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో తాటిపాకలోని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ భవనం నుంచి అప్పనపల్లి వరకు గజమాల యాత్ర సాగింది. కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో యువకుల కేరింతలతో యాత్ర సాగింది. బాలబాలాజీ ఆలయం చెంతనే ఉన్న రామస్వామి-ఆదిలక్ష్మి విగ్రహాలకు భారీ గజమాలను రంగనాయకులు సమర్పించారు. అధిక సంఖ్యలో శెట్టిబలిజ సంఘీయులు, మొల్లేటి రామస్వామి అభిమానులు పాల్గొన్నారు.

### బాలబాలాజీ సన్నిధిలో కల్యాణోత్సవ పూజలు

అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సోమవారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, సహస్ర నామార్చనలు, బాలభోగ నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద గోష్ఠి, చతుష్టానార్చనలు జరిగాయి. అర్చకులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీస్వామివారు గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆరాధన, సాంయాకాలర్చన, చతుష్టానార్చనలు, నిత్యోపాసన, బలిహరణ తదితర పూజలను అర్చకులు జరిపారు. ఈకార్యక్రమాలన్నీ చలమచర్ల కృష్ణమాచార్యుల శిష్యబృందం, ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుల ఆధ్వర్యంలో సహాయ కమిషనర్ జి.మాధవి పర్యవేక్షణలో నూతన ఉత్సవ కమిటీ సమక్షంలో జరిగాయి.

# సమగ్ర శిక్షా సీఆర్పీల జిల్లా నూతన కార్యవర్గం



నామాడి వెంకట్రావు, పి.రవికుమార్

అమలాపురం టౌన్, జూన్ 17: సమగ్ర శిక్షా సీఆర్ఎంటీ (సీఆర్పీ)ల సర్వసభ్య సమావేశం సోమవారం అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ఈసందర్భంగా జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మెండి శ్రీనుబాబు (అమలాపురం), అధ్యక్షుడిగా నామాడి వెంకట్రావు (అల్లవరం), ప్రధాన కార్యదర్శిగా పి.రవికుమార్ (కాట్రేనికోన), మహిళా కార్యదర్శిగా ఎం.అనూష (అమలాపురం), కోశాధికారిగా ఎం.అర్జున్ (పి.గన్నవరం), కన్వీనర్‌గా ఎ.రాజేంద్ర (ఆత్రేయపురం), సహ కన్వీనర్‌గా ఎం.నీలాంబరం (ఐ.పోలవరం), ఉపాధ్యక్షులుగా బి.కిశోర్ (సఖినేటిపల్లి), కేపీ రాములు (రాయవరం), సంయుక్త కార్యదర్శిగా గూటం నాగన్న (అమలాపురం), భరోసా కన్వీనర్లుగా కె.నాగభూషణం (కాట్రేనికోన), ఎం.చంద్రరావు (అయినవిల్లి)లను ఎన్నుకున్నారు.

# ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు




వాడపల్లి శ్రీవేణుగోపాలస్వామి, మరిడమ్మ, మల్లమ్మతల్లి

ఆత్రేయపురం, జూన్ 17: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయన క్షేత్ర పాలకుడు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దివ్య కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం పంచామృతాభిషేకం, నవనీత అలంకరణలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వరపూజ, కన్యాదానం, మహా సంకల్పం, మాంగల్యధారణ, యజ్ఞోపవీత ధారణ, తలంబ్రాలతో కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉపకమిషనరు కిశోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ర్యాలి జగన్మోహినీకేశవస్వామి క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అంకురార్పణ, ధ్వజారోహణం గావించి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఘనంగా మరిడమ్మ జాతర

అల్లవరం, జూన్ 17: మండలగూడాల గ్రామదేవత మరిడమ్మ అమ్మవారి జాతర సోమవారం ఘనంగా జరిగింది. శక్తివేషాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులతో యువకులు సందడి చేశారు. మంగళవారం తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

### నేడు మల్లమ్మతల్లి తీర్థం

కాట్రేనికోన, జూన్ 17: ఇరుమండలో మంగళవారం మల్లమ్మతల్లి తీర్థం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి పెదజాగారం భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఘటాలకు ప్రత్యేక పూజలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాలు, బాణసంచాకాల్పులతో ఉత్సాహంగా యువత ఆధ్వర్యంలో జాగారం జరిగింది. ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. ర్యాలి గంగాధర వెంకటేశ్వరరావు(చిట్టిబాబు) ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది.

# త్యాగ నిరతిని పెంపొందించే బక్రీద్



అమలాపురం: మొల్లాముస్తఫా మసీదులో ముస్లిం సోదరుల ఆలింగనం, మండపేటలో మసీదులో ప్రార్థనలు

అమలాపురం టౌన్, జూన్ 17: సమాజంలో త్యాగ నిరతిని పెంపొందించే పండుగ బక్రీద్ అని అమలాపురం మొల్లాముస్తఫా మసీదు ఇమామ్ మొహమ్మద్ రజ్జా పేర్కొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని సోమవారం మసీదులో ఉదయం నుంచీ ఈద్ ఉల్ హదా నమాజులు జరిగాయి. మొహమ్మద్ రజ్జా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇస్లాంలో త్యాగం, దాన గుణాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే బక్రీద్ పండుగ సమానత్వ భావనను పెంపొందిస్తుందన్నారు. నమాజుల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఎండీ అమీర్, ఎండీ ఆజామ్, మొహిద్దీన్, వలీ, జీఎం ఖాన్, బషీర్ పాల్గొన్నారు.

**రావులపాలెం:** మండలంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుని నమాజు చేశారు.

**ముమ్మిడివరం:** బక్రీద్‌ను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముమ్మిడివరం గొల్లగూడెంలోని షియా మసీదులో మౌలానా మొహ్మద్ తకీ ముస్లింలకు బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. సున్ని జామియా మసీదులతో పాటు ఐ.పోలవరం, చెయ్యేరు, కాట్రేనికోన, అనాతవరంల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

**అంబాజీపేట:** స్థానిక పెద్ద వీధిలోని అంజుమానే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సెంటరు మీదుగా ఖబర్‌స్తాన్‌కు చేరుకుని దివంగతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ రఫీ, కరీం, పాషా, వలీ తదితరులు పాల్గొన్నారు.

**మండపేట:** మండపేట కలవపువ్వుసెంటరులోని జామీయా మసీదు, గాంధీనగర్ చిన్నమసీదు, రావులపేట మసీదుల్లో ముస్లింలు ఇమామ్‌లు నేతృత్వంలో ప్రార్థనలు జరిగాయి. పూర్వీకుల సమాధులు వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

**యానాం:** స్థానిక మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వఢిల్లీ ప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లిఅశోక్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

**ద్రాక్షారామ:** ద్రాక్షారామ షియా జామియా జాఫరీ మసీదులో ముస్లింలు ఈద్ ప్రత్యేక నమాజ్ జరిపారు. మత గురువు మీర్జా అస్కరీ హుస్సేన్ నమాజ్ చేశారు. తండ్రి కొడుకులు హజరత్ ఇబ్రహీం, హజరత్ ఇస్మాయిల్ త్యాగాలను వివరించారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పూర్వీకుల సమాధుల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

**మామిడికుదురు:** మామిడికుదురులోని షియా, సున్ని జామియా మసీదుల్లో బక్రీద్ నమాజులు జరిగాయి. మత ప్రబోధకులు మహ్మద్ ఇబ్రహీం, తారిఖ్‌అన్వర్ రజ్వీలు బక్రీద్ ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. మొగలికుదురు మసీదు, నగరం పెదపంజీషల్లోను నమాజులు జరిగాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**రాయవరం:** వెదురుపాక మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ హఫీజ్ మహ్మద్ అబూ బక్కర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఖురాన్ సందేశాన్ని మత గురువు వివరించారు. మతపెద్ద షేక్ అహ్మద్‌భాషా, షేక్ ఖాజాబాబు, వల్లి, మహబూజ్ భాషా, సలీం, సయ్యద్ భాషా, ముస్లింలు పాల్గొన్నారు.రాయవరం, లొల్ల, చెల్లూరు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

# ఘనంగా మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు




ద్రాక్షారామ: జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, దివ్యాంగులకు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్ కె.గంగవరం: నరజాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 17: మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రామచంద్రపురంలో మంత్రి సుభాష్ నివాసంలో ఆర్డీవో ఎస్.సుధాసాగర్, కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు కె.సుబ్బారావు సుభాష్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత మంత్రి సుభాష్ పట్టణంలో అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో నారా లోకేష్ ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో 2వేల మందికి ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. లయన్స్ కల్యాణ మండపంలో అభిమానులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ద్రాక్షారామలో మాధవానంద కల్యాణ మండపంలో రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన యువకులను సుభాష్ అభినందించారు. రామచంద్రపురంలో చింతపల్లి సూరన్ననగర్‌లో కుడుపూడి ఫణితేజ, లోవకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. సోమేశ్వరానికి చెందిన ముసళ్లమ్మతల్లి కేర్ క్లబ్ సభ్యులు సమకూర్చిన యూనిఫారమ్స్ రామచంద్రపురంలో సిద్ధి వినాయక ఆటోస్టాండ్ యూనియన్‌లో 80మంది కార్మికులకు మంత్రి పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు..

### కూటమి విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు గుర్తింపు

తన విజయానికి కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతీ కార్యకర్తను గుర్తిస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం వెంకటాయపాలెంలో సాయిమాధవానంద పంక్షన్‌హాలులో జరిగిన జన్మదిన వేడుకల్లో మంత్రి మాట్లాడారు. అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేకును కట్ చేశారు. టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, గంధం పల్లంరాజు, రేవు శ్రీను, దొంగల శ్రీధర్, టేకుమూడి సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి సుభాష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సుభాష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


అమలాపురం: మెట్ల రమణబాబు ఇంటి వద్ద వేడుకలు

### దివ్యాంగులకు రూ.లక్ష ఆర్థిక సాయం

షహబాజ్‌పేటకు చెందిన పెంటపాటి శ్రీనివాస్, పద్మ దంపతుల కుమారుడు ఆనంద్‌కుమార్, కుమార్తె వందన పుట్టుకతో దివ్యాంగులు. ఎన్నికల ప్రచారంలో దివ్యాంగుల దీనస్థితి చూసి ప్రతీ జన్మదినంరోజున రూ.లక్ష అందజేస్తానని సుభాష్ ప్రకటించారు. సోమవారం జన్మదినం పురస్కరించుకుని సుభాష్ దివ్యాంగుల తల్లిదండ్రులకు రూ.లక్ష అందజేశారు

### అమలాపురంలో వేడుకలు

అమలాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసితొలిసారి అమలాపురం విచ్చేసిన వాసంశెట్టి సుభాష్‌కు కూటమి శ్రేణులు సోమవారం రాత్రి అపూర్వ స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంలో మిత్రుడైన గంధం పల్లంరాజుతో కలిసి భారీ ఊరేగింపుగా నల్లవంతెన వద్దకు చేరుకున్నారు. తొలుత ముక్తేశ్వరంలోని క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో సుభాష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయినవిల్లి సిద్ధివినాయకుని దర్శించుకున్నారు. అనంతరం సిరిపల్లి సెంటర్లో అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో అమలాపురం చేరుకున్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద భారీ కేక్ ఏర్పాటు చేయగా కూటమి నాయకుల సమక్షంలో సుభాష్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిక్కాల గణేష్, పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు మల్లుల పోలయ్య, వలవల శివరావు, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు. అనంతరం బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు సరిదే సత్యపల్లంరాజు, కాండ్రేగుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుభాష్ కేక్ కట్ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. విత్తనాల శ్రీనివాసరావు, వేటూరి వెంకటేశ్వరరావు, బొక్కా నాగేంద్రకుమార్, చొల్లంగి సత్యసాయిబాబా, గుబ్బల ఏడుకొండలు, గుబ్బలపెద్దిరాజు, గుబ్బల నాగసత్యనారాయణ, కటకం చంద్రశేఖర్ పాల్గొన్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా శ్రీరామపురంలోని స్వగృహం వద్దకు మంత్రి సుభాష్ చేరుకున్నారు. అప్పటికే జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అభిమానుల సమక్షంలో కేక్‌ను సుభాష్ కుటుంబ సభ్యులతో కలిసి కట్ చేశారు.

**కె.గంగవరం:** మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు మండలంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కె.గంగవరంలో జనసేన ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 34మంది రక్తందానం చేశారు. జనసేన నాయకులు చిర్రా రాజ్‌కుమార్, దేవరపల్లి చక్రి, తాడాల జానకిరామ్, తోట వెంకన్న, సలాది శ్రీను పాల్గొన్నారు. కూళ్లలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నరజాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మంత్రి సుభాష్ బంధువుల టీం సభ్యులు మేడిశెట్టి కృపాకర్, శ్రీనివాస్, దొమ్మేటి నారాయణ, కడలి శివగోవింద రాజు పాల్గొన్నారు. అముజూరులో టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. యండగండిలో చుండ్రు వీవీ ఎస్ఎస్ చౌదరి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

### కూటమి విజయంతో మొక్కు తీర్చుకున్న పార్టీ శ్రేణులు

అమలాపురం రూరల్, జూన్ 17: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించాలని కోరుకుంటూ బండారులంక వీరన్నబాబు సెంటర్లోని ఆర్లపల్లి అమ్మన్న గద్దె వద్ద కూటమి శ్రేణులు మొక్కుకున్నారు. కూటమి ఘన విజయం సాధించడంతో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి సోమవారం మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మన్నను నూతన వస్త్రాలతో సత్కరించారు. సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ ఎంపీటీసీ మాడా మాధవి, యాళ్ల సుబ్బలక్ష్మి, కాశిన బాబి, కాశిన ఫణీంద్ర, యినుమర్తి సతీష్, జీవరత్నం, కడలి వెంకటేశ్వరరావు, పెనుమాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కు తీర్చుకున్న కూటమి నాయకులు

ఉప్పలగుప్తం, జూన్ 17: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే 128 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తామని విజయకనకదుర్గకు కిత్తనచెరువు గ్రామ కూటమి నాయకులు మొక్కుకున్నారు. చంద్రబాబు తిరుగులేని ఆధిక్యతతో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించడంతో కూటమి నాయకులు సోమవారం కనకదుర్గ ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచేగౌరీశ్రీను, ఉపసర్పంచ్ కుంచే అర్జున్, కూటమి నాయకులు చిల్లా చినబాబు, పోతుల బుజ్జి, బండారు వెంకన్నబాబు, పులపర్తి వెంకటేశ్వరరావు, శాఖ రాంబాబు, రాయుడు త్రిమూర్తులు, యల్లమిల్లి శ్రీను పాల్గొన్నారు.

### 'సమస్యలపై నిరంతర పోరాటం'

యానాం, జూన్ 17: యానాం నియోజవర్గంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకుడు అర్ధాని దినేష్ విలేకరులతో మాట్లాడారు. పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని, ఇందుకు సహకరించిన యానాం ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వైథిలింగాన్ని కలిసి సత్కరించడంతో పాటు యానాంలో ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎంపీ సహకారంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను భద్రపరిచేందుకు డీఫ్రీజర్ కూడా లేకపోవడం దారుణమన్నారు. నాయకులు పైడికొండల రాజబాబు, శ్రీమంతులు శ్రీధర్, లంకే జాన్ పాల్గొన్నారు.

### క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో వేగుళ్లకు సన్మానం



మండపేట, జూన్ 17: మండపేట నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో క్రైస్తవుల పాత్ర ఎనలేనిదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తాపేశ్వరంలోని డేనియెల్‌పాల్ చర్చిలో సోమవారం డేనియెల్‌పాల్ ఆధ్వర్యంలో క్రైస్తవులు వేగుళ్లను ఘనంగా సత్కరించారు.

### రిజర్వేషన్ వర్తింప చేయాలి

కాట్రేనికోన, జూన్ 17: డీఎస్సీ ఎంపికల్లో గతంలో కాపులకు అయిదు శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం అమలుచేయాలని రాష్ట్ర కాపు రిజర్వేషన్ ఉద్యమ నాయకుడు త్సవటపల్లి నాగభూషణం కోరారు. ఈఅంశంపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌లను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు.

### మొక్కు చెల్లింపు

మండపేట, జూన్17:ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు విజయం సాధించడంతో ఆలమూరు రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్ 101కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### మంత్రి మనోహర్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, జూన్ 17: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలోని ఆయన స్వగృహంలో అమలాపురం వీర మహిళలు, జనసైనికులు కలుసుకుని అభినందనలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో లింగోలు పండు, కంచిపల్లి అబ్బులు, కొప్పుల నాగమానస, తిక్కా సరస్వతి, మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### రూరల్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మృతి



మామిడికుదురు, జూన్17: మామిడికుదురులో గల నగరం రూరల్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు నయినాల వెంకటస్వామినాయుడు(84) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. రెండుసార్లు బ్యాంకు అధ్యక్షుడిగా పనిచేశారు. మామిడికుదురులోని విష్ణాలయం, శివాలయం, కోదండ రామాలయం నిర్మాణాలకు విరాళాలందించారు.

### సినిమా గైడ్

**అమలాపురం**

| | |
|---|---|
| వెంకటరామ | : -- |
| వెంకటరమణ | : మనమే |
| శ్రీలలిత | : రక్షణ |
| శేఖర్ స్ర్కీన్-1 | : ప్రేమించొద్దు |
| శేఖర్ స్ర్కీన్-2 | : బ్యాడ్‌బాయ్స్ |
| రమా | : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి |
| గణపతి | : బాక్ |
| వెంకటపద్మావతిస్ర్కీన్-1 | : సత్యభామ |
| వెంకటపద్మావతి స్ర్కీన్-2 | : భజే వాయువేగం |

### ఆర్యవైశ్య సంఘ నాయకుల సహాయం

రాజోలు, జూన్ 17: అమలాపురానికి చెందిన కంచర్ల అయ్యప్ప సోదరుడు భైరవమూర్తి ఆదివారం హైదరాబాద్ యశోధ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల మార్పిడి చేయించుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. భైరవమూర్తికి సాయం చేయాలని అమలాపురానికి చెందిన జిల్లా మాజీ అధ్యక్షుడు కొల్లూరి చినబాబు పిలుపు ఇచ్చారు. జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు స్పందించి రూ.1,35,430 సమకూర్చారు. తాటిపాకలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి సోమవారం భైరమూర్తి సోదరుడు అయ్యప్పకు రూ.1,35,430 అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం చైర్మన్ లక్కింశెట్టి బాబులు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, నంబూరి సత్యనారాయణ, పసలపూడి సతీష్, శింగంశెట్టి కుమార్, పచ్చిగోళ్ల సోమరాజు పాల్గొన్నారు.

### ఆర్చరీలో కార్తికేయకృష్ణ ప్రతిభ



ఆత్రేయపురం, జూన్ 17: అంకంపాలేనికి చెందిన ఓ యువకుడు బంగారు పతకం సాధించాడు. టీడీపీ అంకంపాలెం గ్రామ శాఖ అధ్యక్షుడు కుడప కృష్ణమూర్తి మనుమడు కార్తికేయకృష్ణ రాజమహేంద్రవరం ఫ్యూచర్ కిడ్స్ స్కూలులో పదో తరగతి చదువుతున్నాడు. మొయినాబాద్‌లోని సుజాత పబ్లిక్ స్కూల్లో జరిగిన ఐసీఐసీ ఉభయ తెలుగు రాష్ట్రాల అండర్-19 ఆర్చరీ (కాంపౌండ్ విల్) టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిబంగారు పతకం సాధించాడు. సోమవారం కృష్ణను ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ అభినందించారు.

### ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలి



రావులపాలెం, జూన్ 17: మెగా డీఎస్సీలో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగుల కోసం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర నిరుద్యోగ ప్రత్యేక ఫెడరేషన్ తరపున బడుగు మహిమారావు, మల్లిడి సాయిలక్ష్మి, రవిప్రసాద్ కోరారు. మంగళగిరిలో జరిగిన ప్రజాదర్బారులో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారని ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ ఏపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ తెలిపారు.

### అయినవిల్లిలంకలో సుభాష్‌కు ఘన స్వాగతం

అయినవిల్లి, జూన్17: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు మండలంలో కూటమి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం ముక్తేశ్వరం-కోటిపల్లి రేవు దాటి అమలాపురం వస్తుండగా ముక్తేశ్వరం రేవు నుంచి సెంటర్ వరకు కూటమి శ్రేణులు, అభిమానులు దారి పొడవునా పూల వర్షం కురిపించారు. ముక్తేశ్వరం సెంటర్‌లో భారీగా బాణసంచా కాల్చారు. పలువురు పూలమాలలతో సత్కరించారు. సుభాష్ పుట్టినరోజు సందర్భంగా ముక్తేశ్వరం సెంటర్‌లో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కడలి వెంకటసత్యనారాయణ (పెద్ద), కాకర శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు, గంధం పల్లంరాజు, సలాది బాబూరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సుభాష్‌కు సోమవారం కూటమి శ్రేణులుస్వాగతం పలికారు. అయినవిల్లిలంకలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్‌ను సుభాష్ కట్‌చేశారు. సుభాష్‌కు స్వాగతం పలికిన వారిలో నాయకులు కళ్లేపల్లి వెంకటసుబ్బరాజు, బిక్కిన బాబి, పెంద్ర రమేష్, సయ్యపురాజు సత్తిబాబురాజు, వర్రే శ్రీను, మాద్దాల రాజా, మోత వెంకటేశ్వరరావు, వస్కా శ్యామ్, బడుగు భాస్కరజోగేష్ ఉన్నారు.

### నేడు రావులమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, జూన్ 17: గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. పదమూడు రోజులుగా అమ్మవారి ఉత్సవాలను వివిధ సామాజికవర్గాలకు చెందిన భక్తులు నిర్వహిస్తున్నారు. అమ్మవారి పూజా ఘటాలు, గరగలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

### యాదవుల సంఘ అధ్యక్షుడిగా నాగరాజు

అంబాజీపేట, జూన్ 17: పి.గన్నవరం నియోజకవర్గ యాదవుల సంఘ అధ్యక్షుడిగా నాగళ్ల నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కె.పెదపూడిలో జరిగిన సంఘ సమావేశంలో ఉపాధ్యక్షుడిగా జి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చిట్టిమేను రమణ, సంయుక్త కార్యదర్శిగా గాలి వీర వెంకట బాలాజీ, కోశాధికారిగా మట్టా రెడ్డి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### ఘనంగా జనార్ధనస్వామి గ్రామోత్సవం

కపిలేశ్వరపురం, జూన్ 17: కపిలేశ్వరపురం శ్రీజనార్ధనస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అనంతరం గ్రామోత్సవం జరిగింది. రాత్రి వేదపండితులు వెంకటలక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

### రామేశ్వరం యాత్రకు ఆర్టీసీ బస్సు

రావులపాలెం, జూన్ 17: ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి రామేశ్వరం యాత్రకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు మేనేజరు కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీన రావులపాలెంలో బయల్దేరు బస్సు 17న తిరిగి రావులపాలెం చేరుకుంటుందన్నారు. భోజన ఖర్చులు సహా మనిషికి టిక్కెట్ ధర రూ.8వేలుగా నిర్ణయించామన్నారు. యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీరంగం, జంబుకేశ్వరం, మధురై, రామేశ్వరం, ధనుష్కోటి, తంజావూరు, స్వామిమలై, కుంభకోణం, తిరువారూర్, తిరుకడయార్, చిదంబరం, కాంచీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజరును 7382911871 నెంబరులో సంప్రదించాలని కోరారు.

### వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆలమూరు, జూన్17:గుమ్మిలేరులో శ్రీదేవి,భూదేవి సమేతవేంకటేశ్వరస్వామి 36వవార్షిక కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం తొలుత గ్రామోత్సవం జరిపించారు. ఆలయంవద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి ఆలయ ప్రధానార్చకుడు విజయకుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు వేదపండితులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. గ్రామానికి చెందిన గుణ్ణం త్రిసోన్-శ్రీసంయుక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ఇసుక నిల్వలను తరలించడం సరికాదు

కపిలేశ్వరపురం, జూన్17: కపిలేశ్వరపురం ర్యాంపు వద్ద వరదలు సమయంలో వినియోగదారుల కోసం ఉంచిన నిల్వలను సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సందర్శించారు. కూటమి నేతల ప్రోద్బలంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఎన్నికల్లో హామీమేరకు ఇసుకను ఉచితంగా అందజేయాలన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### గోడిలంక ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

అల్లవరం, జూన్ 17: గోడిలంక వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మొగళ్లమూరి గ్రామానికి చెందిన అల్లు గణేష్ మణికంఠ (24) అమలాపురంలోని సాయిరవీంద్ర ఆసుపత్రిలో పీఆర్వోగా పనిచేస్తున్నాడు. మోటారు సైకిలుపై మొగళ్లమూరి ఇంటికి వెళ్తున్నాడు. తుమ్మలపల్లికి చెందిన పోస్టల్ ఉద్యోగి మెడపల జోయల్ కూడా మోటారు సైకిలుపై వెళ్తున్నాడు. వారిద్దరూ గోడిలంక వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరూ గాయపడగా మణికంఠ చికిత్స పొందుతూ మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

### మందేశ్వరుని దర్శించుకున్న కమిషనరు

కొత్తపేట, జూన్ 17: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామిని సోమవారం రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనరు కె.దినేష్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ప్రధానార్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేదపండితులు స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

### ఆనందరావుకు అభినందనల వెల్లువ

అమలాపురం టౌన్, జూన్ 17: అమలాపురం ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావును సోమవారం పలు సంఘాల నాయకులు కలుసుకుని సత్కరించారు. ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.